

ఎవరితోనూ మాట్లాడను : కరవే నేత నారాయణగౌడ

బెంగళూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కన్నడ బోర్డులు ఏర్పాటు చేయాలనే సాగిన ఆందోళన వేళ పోలీసులు అరెస్టు చేయడంతో జైలుపాలైన కర్ణాటక రక్షణ వేదిక అధ్యక్షులు నారాయణగౌడ పరప్పన అగ్రహార జైలు నుంచి విడుదలయ్యారు. జైలు నుంచి బయటకు వచ్చిన వెంటనే ఫేస్‌బుక్ లైవ్ ద్వారా మాట్లాడారు. ఆరోగ్య పరంగా కొంత విశ్రాంతి కావాలని ఎవరితోను మాట్లాడేది లేదన్నారు. కరవే పిలుపుతో సాగిన కన్నడ బోర్డుల ఉద్యమానికి ప్రభుత్వం నుంచి స్పందన వచ్చిందని ఆర్డినెన్స్ జారీ చేశారన్నారు. మా పోరాటానికి అన్ని కన్నడ సంఘాల ముఖ్యులు మద్దతు ఇవ్వడంపై సం తోషం వ్యక్తం చేశారు.



మత్తెక్కిస్తున్న మాఫియా

- సిలికాన్ సిటీని వణికిస్తున్న డ్రగ్ పెడ్లర్లు
- డార్క్‌నెట్ ద్వారా కార్యకలాపాలు
- రూ.కోట్లలో పట్టుబడుతున్న మాదకద్రవ్యాలు
- ఉక్కుపాదం మోపుతాం : హోం మంత్రి డా.జి.పరమేశ్వర్



బెంగళూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయంగా వేళ్నూనుకున్న డ్రగ్స్ మాఫియా సిలికాన్ సిటీని గజగజ వణికిస్తోంది. నగర పోలీసులు పదే పదే డ్రగ్స్‌మాఫియా కోరలు పీకేస్తున్నా ఈ వ్యవహారం చాపకింద నీరులా సాగుతూనే ఉంది. పోలీసుల వ్యూహాలకు సైతం అందని రీతిలో డ్రగ్ పెడ్లర్లు ఎప్పటికప్పుడు తమ రూట్‌ను మార్చేస్తున్నారు. గతంలో విమానాలు, రైళ్ళు, బస్సుల ద్వారా మాదకద్రవ్యాలను తరలిస్తూ వచ్చిన మాఫియా ముఠాలు ఇప్పుడు నగరంలోనే తిష్టవేసి స్థానికంగానే వీటిని తయారు చేస్తున్న వైనం, వినియోగదారులకు వీటిని చేరవేసేందుకు 'డార్క్‌నెట్' సేవలను వినియోగిస్తున్న తీరు పోలీసు వర్గాలను సైతం ఖంగుతినిపిస్తోంది. మాదక ద్రవ్యాలు ఏరూపంలో ఉన్నా సహించేది లేదని యువత వీటి బారిన పడకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు హోం శాఖ మంత్రి డాక్టర్.జి. పరమేశ్వర్ వెల్లడించారు. నగరంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 2021లో నగరంలో రూ 60 కోట్ల విలువ చేసే రకరకాల మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకోగా 2023లో సీసీబీ పోలీసులు రూ 103 కోట్ల విలువ చేసే డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారని ఇటీవల నూతన సంవత్సర వేడుకలకోసం సిద్ధంచేసిన మాదకద్రవ్యాలను భారీప్రమాణంలో స్వాధీనం చేసుకు న్నామన్నారు. వందలాది కేజీల గంజాయి, సింథటిక్, సెమీ సింథటిక్ డ్రగ్స్ వీటిలో ఉన్నాయన్నారు. గత ఏడాది డిసెంబరులో నగర పోలీసులు ప్రత్యేక కార్యాచరణ జరిపి 9 మంది విదేశీయులతో సహా మొత్తం 56 మంది డ్రగ్ పెడ్లర్లను అరెస్టు చేశారని వీరి వద్ద నుంచి 99.85 కిలోల మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. యువత మాదక ద్రవ్యాల బారిన పడి తమ విలువైన జీవితాన్ని నాశనం చేసుకోకుండా ఉండేందుకు ఒక పక్క కళాశాలలు, యూనివర్సిటీ స్థాయిలో జాగృతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు.

పోలీసుల కళ్లు గప్పి.... కొత్త మార్గాల్లో

డ్రగ్స్‌మాఫియా పోలీసుల ఎత్తులకు పై ఎత్తులు వేస్తోంది. డ్రగ్ పెడ్లర్లు వీటిని పోలీసుల కళ్ళు గప్పి కొత్త రూపాల్లో చేరవేస్తోంది. ఎవరికీ అనుమానం రాకుండా వస్త్రాలు, సబ్బులు, చాకోలేట్లు, బిస్కెట్లలో దాచి పక్కాగా కొరియర్లలో నిర్దిష్ట లక్ష్యాలకు చేరవేస్తోంది. డ్రగ్ పెడ్లర్లు సోషల్ మీడియాను విరివిగా వినియోగిస్తున్నట్లు గుర్తించి వీటిపై ఒక కన్నేసి ఉంచామని బెంగళూరు పోలీసు కమిషనర్ బి. దయానంద్ అంటున్నారు. ప్రత్యేకించి మొబైల్‌లోని వాట్సాప్ గ్రూపులను ఇటీవలి కాలంలో అధికంగా వీరు వినియోగిస్తున్నట్లు గుర్తించామన్నారు. సోషల్ మీడియాలోని వివిధ విభాగాల ద్వారా డార్క్‌నెట్ సాయంతో మాదక ద్రవ్యాల రవాణా యథేచ్ఛగా సాగుతున్నట్లు తమ పరిశీలనలో తేలిందన్నారు. బెంగళూరు శివారు ప్రాంతాల్లోని గ్రామాల్లో గంజాయి, అఫీము వంటి మాదక ద్యవ్యాలను రహస్యంగా పండిస్తున్నారనే సంగతి కూడా ఇటీవలి దాడుల్లో వెలుగు చూసిందన్నారు. గత ఏడాది నగర పోలీసులు 5,252 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని 4,059 మందిని అరెస్టు చేశారన్నారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి విలువే రూ 29.62 కోట్లుగా ఉందన్నారు. సహజ సిద్ధమైన డ్రగ్స్‌తో పాటు రసాయనిక పదార్థాలను వినియోగించి మార్ఫిన్, హెరాయిన్, కూడైన్ వంటి సెమి సింథటిక్ మాదకద్రవ్యాలను కూడా నగరంలో విక్రయిస్తున్నట్లు గుర్తించామన్నారు. మాదక ద్రవ్యాలను విక్రయించే పెడ్లర్లపై డేగకన్ను వేశామని అనుమానం ఉన్నచోట్ల సీసీటీవీ కెమెరాలతో నిఘాను పెంచామని ఇది కూడా బాగా ఫలితాన్నిస్తోందని కమిషనర్ వెల్లడించారు.

పూర్తిగా నియంత్రణలోకి రాలేదు...



డ్రగ్స్ మాఫియా ఎత్తులను ఎప్పటికప్పుడు గుర్తించి చిత్తుచేసేందుకు నగర పోలీసు యంత్రాంగం ఎంతగా ప్రయత్నిస్తున్నా ఇది ఇంకా పూర్తిగా నియంత్రణలోకి రాలేదు. 2021లో రాజధాని బెంగళూరు నగరంలో 4,555 డ్రగ్స్ కేసులు నమోదు కాగా 5,753 మందిని అరెస్టు చేశారు. ఇక 2022 లో 4,027 కేసులు నమోదు కాగా 5,215 మంది అరెస్టయ్యారు.2023లో 3,443 కేసులు నమోదు కాగా 4,399 మంది అరెస్టయ్యారు. మొత్తానికి నగర పోలీసు యంత్రాంగానికి డ్రగ్స్ మాఫియా పెనుసవాల్‌గా పరిణమించింది. సాంకేతికతను వినియోగించుకుని డ్రగ్ పెడ్లర్లు తమ కార్యకలాపాలను కొనసాగిస్తుండా వీటికి పూర్తిస్థాయిలో బ్రేక్ వేసే దిశలో నగర పోలీసు యంత్రాంగం మరింతగా సన్నద్ధం కావాల్సిన అవసరం ఉందని హోంశాఖ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



పట్టుబడిన డ్రగ్స్‌ను పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)



చలో ఢిల్లీ..

- రాహుల్, ఖర్గేల పిలుపుతో 28మంది ఇన్‌చార్జ్ మంత్రులు హస్తినకు
- సీఎం, డీసీఎంలూ పయనం

బెంగళూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సీఎం, డీసీఎం సహా ఇన్‌చార్జ్ మంత్రులందరూ ఢిల్లీ బయల్దేరారు. లోక్‌సభ ఎన్నికలలో కర్ణాటక నుంచి ఎక్కువ స్థానాలు దక్కించుకోవాలనే లక్ష్యంగా పెట్టుకున్న కాంగ్రెస్ అధిష్ఠానం ఆదిశగానే కసరత్తు సాగిస్తోంది. కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, కీలక నేత రాహుల్ గాంధీల పిలుపుమేరకు లోక్‌సభ నియోజకవర్గాలకు ఇన్‌చార్జ్‌లుగా నియమింపబడిన 28మంది మంత్రులతో పాటు సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌లు గురువారం హస్తినకు బయలుదేరారు. దాదాపు మూడురోజులుగా బెంగళూరులోనే మకాం వేసిన రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సూర్జేవాలా నిరంతరంగా సమావేశాలు జరిపిన విషయం తెలిసిందే. ఇం దులో భాగంగానే రెండురోజుల కిందట ప్రతి లోక్‌సభ నియోజకవర్గానికి ఒక మంత్రిని ఇన్‌చార్జ్‌గా నియమించారు. వారందరికీ ఢిల్లీ రావాలని బుధవారం పిలుపు వచ్చింది. ఈమేరకు దాదాపు మంత్రులందరూ ఒకే సారి ఢిల్లీ బయలుదేరారు. వీరితో పాటు సీఎం, డీసీఎంలు ఉన్నారు. ఇన్‌చార్జ్ మంత్రులు పరమేశ్వర్, రామలింగారెడ్డి, జమీర్‌అహ్మద్, చెలువరాయస్వామి, ఈశ్వర్‌ఖండ్రే, ఆర్‌బీ తిమ్మాపుర, ఎంబీపాటిల్, లక్ష్మీహెబ్బాళ్కర్, మహదేవప్ప, డాక్టర్ ఎంసీ సుధాకర్, ఎస్ఎస్ మల్లికార్జున, కేజె జార్జ్, మధు బంగారప్ప, కేఎన్ రాజణ్ణ, దినేష్‌గుండూరావ్, మంకాళ్‌వైద్య, శివరాజ్‌తంగడిగ, ఎస్ఎస్ బోస్‌రాజ్ సంతోష్‌లాడ్, నాగేంద్ర, ప్రియాంకఖర్గే, భైరతి సురేష్ కె. వెంకటేష్, సతీష్‌జార్కిహోళిలు ఉన్నారు. లోక్‌సభ ఎన్నికలలో వ్యవహరించాల్సిన విధానాలపై అధిష్ఠానం పెద్దలు ఇన్‌చార్జ్ మంత్రులకు దిశానిర్దేశం చేయదలచారు. మల్లికార్జునఖర్గే, రాహుల్‌గాంధీలతో పాటు కేసీ వేణుగోపాల్, రణదీప్ సింగ్ సూర్జేవాలాలు సలహాలు ఇవ్వనున్నట్లు సమాచారం. కేబినెట్‌కు చెందిన ఏమంత్రికి లోక్‌సభ టికెట్ ఇవ్వరాదనే అధిష్ఠానం నిర్ధారణకు వచ్చిన నేపథ్యంలోనే వారికి ఇన్‌చార్జ్‌లుగా అదనపు బాధ్యతలు అప్పగించారు. కాగా మరో ముగ్గురికి డీసీఎం హోదాలు ఇవ్వడం ద్వారా ఎన్నికలకు మరింత సులువు కానుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎలాగైనా ఈ సారి మంచి సీట్లు సాధించాలని, లేదంటే మంత్రులపై వేటు తప్పదని ఇప్పటికే అధిష్ఠానం అమాత్యులను హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఆ దిశగానే విజయానికి వ్యూహాలు రచిస్తోంది.



బీజేపీలో జంపింగ్‌ల గోల

- కాంగ్రెస్‌లోకి ముద్దేహనుమేగౌడ?
- తుమకూరు నియోజకవర్గంపై కన్ను



ముద్దే హనుమే గౌడ

బెంగళూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ముందే జంపింగ్‌ల గోల మొదలయ్యింది. ఒకప్పుడు కాంగ్రెస్‌లో ఉండి బీజేపీలో చేరిన నేతలు మళ్లీ హస్తం లోకి మారాలని ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. మాజీ ఎంపీ ఎస్‌పి.ముద్దేహనుమేగౌడ నగరంలో బుధవారం పలువురు కాంగ్రె స్ నేతలను భేటీ కావడం తీవ్ర కుతూహలం రేకెత్తిస్తోంది. తుమకూరు కాంగ్రెస్ టికెట్ హామీ లభించే పక్షంలో ఆయన బీజేపీకి రాజీనామా చేస్తారని గుసగుసలు వినిపిస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికల అభ్యర్థుల ఎంపికకు సంబంధించి కేపీసీసీ నగరంలో ఏర్పాటు చేసిన కీలక సమావేశానికి ముందే ఉప ము ఖ్యమంత్రి డీకే శివకుమార్‌తోనూ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డా.జి.పరమేశ్వరతోనూ ఇదే జిల్లాకు చెందిన సహకార శాఖా మంత్రి కెఎన్.రాజణ్ణతోనూ ఆయన విడివిడిగా సమావేశమయ్యారు. తుమకూరు లోక్‌సభా నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు బలమైన అభ్యర్థి ఎవరూ లేకపోవడం, పోటీచేసేందుకు మంత్రులు పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో ముద్దేహనుమేగౌడను పార్టీలో చేర్చుకుని టికెట్ కేటాయించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో జేడీఎస్‌తో పొత్తు దరిమిలా సిట్టింగ్ ఎంపీ ముద్దేహనుమేగౌడను కాంగ్రెస్ పక్కన పెట్టింది. అసెంబ్లీ ఎన్నికల్లో అవకాశం కల్పిస్తామని సాధ్యం కాకపోతే ఎమ్మెల్సీ చేస్తామని ఆయనకు కాంగ్రెస్ భరోసా ఇచ్చింది. అప్పట్లో ఈ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ మద్దతుతో పోటీచేసిన మాజీ ప్రధాని హెచ్‌డీ.దేవెగౌడ అనూహ్యంగా ఓటమి చవిచూశారు. క్షేత్ర స్థాయిలో కాంగ్రెస్ సహకరించనందునే తాను ఓడిపోయానని దేవెగౌడ పలుమార్లు ఆరోపించారు. ఈ పరిణామాల అనంతరం కాంగ్రెస్ తనకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోకపోవడంతో ముద్దేహనుమేగౌడ ఆ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. బీజేపీలో చేరినా ఆయనకు న్యాయం జరుగలేదు. శాసనసభ ఎన్నికల్లో కుణిగల్ నుంచి పోటీచేయాలని భావించినా బీజేపీ ఆయనకు టికెట్ ఇవ్వలేదు. అప్పటి నుంచి ముద్దే హనుమేగౌడ తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. తిరిగి కాంగ్రెస్ లో చేరితేనే తనకు రాజకీయ భవిష్యత్తు ఉంటుందని ఆయన భావిస్తున్నట్లు తెలిసింది. ఈ సారి బీజేపీ-జేడీఎస్‌ల మధ్య పొత్తు కుదరిన నేపథ్యంలో తుమకూరు నియోజకవర్గంపై కుతూహలం నెలకొని ఉంది. ఈ నియోజకవర్గం నుంచి బీజేపీయే మళ్ళీ పోటీ చేస్తుందా? పొత్తు దరిమిలా జేడీఎస్‌కు అప్పగిస్తుందో వేచిచూడాలి. అయితే ముద్దేహనుమేగౌడ ఒక వేళ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుని పార్టీ అభ్యర్థిగా నిలబడితే తుమకూరులో పోరు ఆసక్తికరం కానుందని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు.






విరామం లేదు..

- అయోధ్య రామ మందిరంపై నేతల మధ్య కొనసాగుతున్న మాటల యుద్ధం

అయోధ్య రామాలయ ప్రారంభోత్సవానికి కాంగ్రెస్ ఆహ్వానాన్ని తిరస్కరించడంపై మాటల యుద్ధం కొనసాగుతోంది. బీజేపీ, కాంగ్రెస్ నేతలు అనుకూల, ప్రతికూల వాదనలు చేస్తుంటే..సీఎం సిద్ధరామయ్య పార్టీ కార్యక్రమంగా మార్చేసిందని బీజేపీపై విరుచుకు పడ్డారు.

అయోధ్యలో జరిగేది కాంగ్రెస్ ఎన్నికల ర్యాలీ కాదు

- కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి ఎద్దేవా



బెంగళూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): అయోధ్యలో జరుగుతుందేది 140కోట్ల మంది భారతీయులు కలలుకన్న ఆలయ ఆరంభమని, శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపనా సంబరమని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ర్యాలీ కాదని కేంద్రపార్లమెంటరీ వ్యవహారాల శాఖా మంత్రి ప్రహ్లాద్‌జోషి ఎద్దేవా చేశారు. గురువారం మంత్రి ట్విట్టర్ ద్వారా రామమందిర ఆరంభం ఆహ్వానాన్ని తిరస్కరించిన కాంగ్రెస్ పార్టీ నేతల తీరుపై మండిపడ్డారు. దేశప్రజలు, రామభక్తులు కాంగ్రెస్ వారిని ఎప్పుడో తిప్పికొట్టారన్నారు. శ్రీరాముడిపై భక్తి, నమ్మకం, విశ్వాసం ఉండేవారు ఏ పార్టీకి చెందిన వారైనా రాజకీయాలను పక్కనబెట్టి దర్శించుకుంటారన్నారు. రాష్ట్రంలో అబద్ధాల హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి పాలనా వైఫల్యాల నుంచి తప్పించుకునేందుకు ఇటువంటి అంశాలను తెరపైకి తీసుకువచ్చేలా కుట్రలు సరికావని సీఎం సిద్దరామయ్యను ఉద్దేశించి మండిపడ్డారు. అబద్ధాల ప్రభుత్వం ఎటువైపు వెళుతుందనేది ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. రాముడంటే ఈదేశ సంస్కృతి అని కనీసం ఉడుత లాంటి సేవ చేసేందుకు కాంగ్రెస్ వారి నుంచి కాలేదన్నారు. ఇలాంటి సందర్భంలో రామమందిర ప్రారంభానికి ఏ మొహం పెట్టుకుని వస్తారన్నారు. ఆయోధ్య మందిర ఆహ్వానాన్ని తిరస్కరించడం ద్వారా వారు ఎలాంటి ఆలోచనలు కలిగిన వారో తెలుస్తుందన్నారు. ఆధ్యాత్మికంగా కాకున్నా రాముడు అనేది మన సంస్కృతి అనే దృష్టి నుంచి చూసే ముస్లింలు, క్రిస్టియన్‌లు కాంగ్రెస్‌ను తిరస్కరించే కాలం వస్తోందని మండిపడ్డారు.

అన్నభాగ్యకు బియ్యం లేవు కానీ... ఇంటింటికీ అక్షింతలా..? : మంత్రి మహదేవప్ప



బెంగళూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): అన్నభాగ్య గ్యారెంటీకి బియ్యం లేవు కానీ అయోధ్యలో రామమందిర ప్రారంభం కోసమని ఇంటింటికీ అక్షింతలు పంపిణీ చేస్తున్నారని కేంద్ర ప్రభుత్వంపై కర్ణాటక సాంఘిక సంక్షేమశాఖా మంత్రి మహదేవప్ప మండిపడ్డారు. గురువారం ఆయన ఎక్స్ ద్వారా తన అభిప్రాయాలు పంచుకున్నారు. ఆకలిలేని రాష్ట్రంగా తీర్చేందుకు ప్రభుత్వం ప్రతి బీపీఎల్ లబ్దిదారుడికి కేంద్రం ఇచ్చే ఐదుకేజీల బియ్యంకు అదనంగా రాష్ట్రం నుంచి ఐదు కిలోలు ఇవ్వదలచామన్నారు. కేంద్ర పౌర ఆహారసరఫరాల విభాగం నుంచి నిర్దేశించిన ధరకంటే ఎక్కువ మొత్తంతో కొనుగోలు చేస్తామని కోరుతున్నా కేంద్ర ప్రభుత్వం అవకాశం ఇవ్వలేదన్నారు. కానీ మతం పేరుతో అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేయడం సర్వమత విధానాలకు వ్యతిరేకమన్నారు. పేదవాడి ఆకలి తీర్చడం కంటే మతం గొప్పదా అని ప్రశ్నించారు. పేదలకు ఇచ్చే బియ్యంలోను రాజకీయం చేసిన వీరు మతం గురించి మాట్లాడుతారన్నారు. ఈవిషయమై నవ్వాలో ఏడ్వాలో నాకు అర్థం కావడం లేదని మండిపడ్డారు.

పార్టీ కార్యక్రమంగా మార్చిన బీజేపీ

- ముఖ్యమంత్రి సిద్దరామయ్య



బెంగళూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపనా కార్యక్రమంలో పాల్గొనరాదనే కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, మల్లికార్జునఖర్గేల నిర్ణయానికి కర్ణాటక సీఎం సిద్దరామయ్య మద్దతు పలికారు. గురువారం బెంగళూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ కులం, మతం, పార్టీలు వర్గాలందరినీ కలుపుకుని గౌరవం, భక్తితో జరగాల్సిన ఆధ్యాత్మిక వేడుకను ఓపార్టీ కార్యక్రమంగా చేశారంటూ మండిపడ్డారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సంఘ్ పరివార్‌కు చెందిన ముఖ్యులు శ్రీరాముడితో పాటు దేశంలోని 140 కోట్ల మంది ప్రజలకు గౌరవం లేకుండా చేశారన్నారు. ఆధ్యాత్మిక వేడుకను రాజకీయ ప్రచారంగా మార్చుకోవడం హిందువులందరికీ చేసిన ద్రోహమని, హిందూ మతం, సంస్కృతి, ఆచార వ్యవహారాల గురించి నిత్యం ఉపదేశాలు ఇచ్చే బీజేపీ, ఆర్ఎస్ఎస్ ముఖ్యులు అసంపూర్ణంగా ఉండే ఆలయాన్ని ఆరంభించేందుకు సిద్ధమైన ప్రధాని నరేంద్రమోదీ నిర్ణయాన్ని వ్యతిరేకించికపోవడం నకిలీ హిందుత్వ అనేది బహిరంగమైందన్నారు. రామమందిర నిర్మాణాలకు కాంగ్రెస్ ఆరంభం నుంచి మద్దతు ఇచ్చిందన్నారు. సుప్రీం కోర్టు తీర్పును గౌరవించామన్నారు. ముస్లింలు కోర్టు తీర్పును అంగీకరించారన్నారు. కానీ ఎన్నో వివాదాలు ఉన్నాయని విచారం వ్యక్తం చేశారు. పదేళ్ళ పాలన ముగించిన ప్రధాని మోదీ విజయాలు వివరించి మరోసారి గెలిచే ఆత్మవిశ్వాసం లేదని అందుకే అసంపూర్తిగా ఉండే రామమందిరాన్ని ఆరంభించడం ద్వారా హిందువులను అక్కున చేర్చుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మేం హిందూ వ్యతిరేకులం కాదని మతం ముసుగులో చేసే విభేధాలకు మాత్రమే అన్నారు. మతాన్ని రాజకీయం చేస్తే సంపూర్ణంగా వ్యతిరేకిస్తామన్నారు.

బెంగళూరు టు అయోధ్య..రికార్డు స్థాయిలో విమానం టిక్కెట్టు ధర

బెంగళూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో ఈ నెల 22న రామ మందిరంలో విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం జరగుతుండంతో బెంగళూరు నుంచి బయల్దేరే రైళ్ళు, విమానాలు, బస్సులకు భారీ డిమాండ్ పెరిగింది. బెంగళూరు నుంచి 1900 కిలోమీటర్ల దూరంలో ఉన్న అయోధ్యను త్వరగా చేరుకునేందుకు విమానం ఒక్కటే మార్గం కావడంతో వీటి టికెట్ల ధరలు ఆకాశాన్నంటాయి. బెంగళూరు నుంచి అయోధ్యకు ఈ నెల 19 నుంచి 21 వరకు బయల్దేరి వెళ్ళే విమానాల టికెట్ల ధర సుమారుగా రూ 24వేల నుంచి రూ 30వేలుగా ఉండటం విశేషం. ఇదొక రికార్డు కానుందని ఎయిర్‌పోర్టు వర్గాలు గురువారం మీడియాకు వెల్లడించాయి. మామూలు రోజులతో పోలిస్తే ఈ చార్జీ ఏకంగా 400 శాతం అధికం కా వడం గమనార్హం. బెంగళూరు కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో మధ్యాహ్నం 1 గంటకు బయల్దేరే విమానం అహ్మదాబాద్‌లో ఐదుగంటల విరామం అనంతరం అయోధ్యకు రాత్రి 11 గంటలకు చేరుకుంటుంది. రైల్లో ప్రయాణం అయితే దాదాపు రెండు రోజుల సమయం పడుతుండంతో అందరూ విమానప్రయాణం వైపే మొగ్గు చూపు తున్నారు.

గ్యారెంటీలతో ఖజానాకు రూ.58వేల కోట్ల భారం


బెంగళూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీలతో రాష్ట్ర ఖజానాకు రూ.58వేల కోట్లు భారమని సీఎం ఆర్థిక సలహాదారుడు బసవరాజరాయరెడ్డి వ్యాఖ్యలు బీజేపీ నేతలకు అస్త్రంగా మారాయి. సోమవారం రాయరెడ్డి మీడియాతో మాట్లాడిన వేళ ఐదు గ్యారెంటీలతో రాష్ట్ర ఖజానాకు తీరని భారం కా నుందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలకు అనుగుణంగా గ్యారెంటీలు అమలు చేయాల్సి వచ్చినందున ఖజానాకు రూ.58వేల కోట్ల మేర భారం పడనుందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని సర్దుబాటు చేసేందుకు ఏవిధమైన ప్రణాళికలు రూపొందించాలనే అంశంపై చర్చించామన్నారు. పథకాల అమలుపై సంస్కరణలు లేదా మార్పులు వంటి అంశాలపైనా చర్చలు జరిగాయన్నారు. ఎన్నికలకు ముందు నుంచి ఐదు గ్యారెంటీల ద్వారా రాష్ట్ర ప్రభుత్వంపై పెనుభారం పడనుందని చెబుతున్నామని, అయినా అధికారంలోకి వచ్చేందుకు అన్ని వర్గాల ప్రజలను మభ్యపెట్టారని బీజేపీ అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా అభిప్రాయపడింది.



"ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్‌బై ఎయిమ్స్ విద్యా సంస్థలు, బెంగళూరు, రియల్ పార్టనర్స్ స్వర్గసీమ సుకేతన" గురువారం విజయవాడలో జరిగిన ఫైనల్స్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించి ప్రతిభ చాటిన హోసూరు మహిళ రాధ



కన్సొలేషన్ బహుమతి సాధించిన బళ్లారి లిఖిత వేసిన ముగ్గు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1588.98	1,622.21
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	000	8,099
సామర్థ్యం (టీఎంసీలు)	10.20	67.75

బ్యారేజ్ పనులను వేగంగా చేయాలి



బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న సోమలింగప్ప

సిరుగుప్ప, జనవరి 11 : బలకుంది -ముదేనూరు గ్రామాల మధ్య బ్రిడ్జి కమ్ బ్యారేజ్ పనులను వేగవంతంగా చేపట్టాలని బీజేపీ మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప డిమాండ్ చేశారు. సిరుగుప్ప తాలుకాలోని బలకుంది, ముదేనూరు గ్రామాల మధ్య హగరి నదిలో జరుగుతున్న బ్రిడ్జి కమ్ బ్యారేజీ నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. జూన్‌లోపే పనులను పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లకు సూచించారు. వర్షాకాలం ప్రారంభమయ్యేలోపు పనులను పూర్తి చేస్తే ఒక టీఎంసీ నీటిని నిల్వ చేసేందుకు సాధ్యపడుతుందని, దీంతో రైతులు రెండు పంటలు పండించేందుకు ఆస్కారం వుంటుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు ఎంఆర్‌గౌడ, బలకుంది పిడ్డయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

తాయమ్మదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో తాయమ్మ అమ్మవారు

సిరుగుప్ప, జనవరి 11: శ్రీ తాయమ్మదేవికి అమావాస్యను పురస్కరించుకుని సిరుగుప్ప పట్టణంలోని ఆదోని రోడ్డులో వెలసిన శ్రీ తాయమ్మ దేవికి ప్రధాన అర్చకులు ప్రవీణ, శ్రీనివాస ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధూపదీప నైవేద్యాలతో పూజలు జరిపి అమ్మవారికి పుష్పాలంకారసేవ, ఆకుపూజ నిర్వహించారు. కమిటీ సభ్యులు, భక్తులు ప్రసాద పంపిణీ చేపట్టారు.

యువత దేశభక్తిని అలవర్చుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న టీజీ విఠల్

బళ్లారి సిటీ, జనవరి 11: యువతరం స్వామి వివేకానంద ఆలోచనలను సరైన రీతిలో అధ్యయనం చేసి దేశ భక్తితో ముందుకు సాగాలని భారత సంక్షేమ కుటుంబ జిల్లా అధ్యక్షుడు టీ.జీ. విఠల్ అన్నారు. నగరంలోని సరళాదేవి కాలేజ్‌లో రెడ్‌క్రాస్ సంస్థ, భారతీయ కుటుంబ సంక్షేమ సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన జాతీయ యువ దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన విజయసింహ మాట్లాడుతూ, దేశ నిర్మాణంలో మహిళల పాత్ర కూడా ఉండాలన్నారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తూ సమాజ ఆరోగ్యాన్ని కాపాడుకోవడంపై దృష్టి సారించాలన్నారు. ప్రిన్సిపాల్ మంజునాథరెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడారు. వివేకానందుడు చాలా కష్టపడి తన ఆలోచనల ద్వారా స్ఫూర్తిని నింపారన్నారు. ఆయన ఆలోచనలు నేటికీ ఆచరణీయమైనవన్నారు. ఈసందర్భంగా విజయ లక్ష్మి, దస్తగిరిసాబ్‌దిన్ని, యూత్ రెడ్ క్రాస్ యూనిట్ డాక్టర్ పల్లవి, శోభరాణి, లింగప్ప తదితరులు పాల్గొన్నారు.

వేపచెట్టుకు పాలు

కంప్లి, జనవరి 11 : కురుగోడు తాలుకా పరిధిలోని వడ్డట్టి గ్రామంలో శ్రీ పాండురంగ స్వామి దేవాలయంలో వేపచెట్టుకు ఏకధారగా తెల్లటి పాలు కారుతుండటంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు ఆ దృశ్యాన్ని తిలకించేందుకు పోటెత్తారు. రెండు మూడు రోజులుగా ఏకధారగా పాలు కారుతుండటంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ద్విచక్రవాహనాలపై ప్రజలు తరలి వచ్చి వేపచెట్టును తిలకించి పూజలు నిర్వహిస్తున్నారు.

ఘాటు తగ్గిన మిరప

సగానికి పడిపోయిన గుంటూరు, బ్యాడిగ మిర్చి ధరలు

కంప్లి, జనవరి 11 : రైతులు పండించిన మిరప పంటకు మార్కెట్లో ధర తగ్గుముఖం పట్టడంతో రైతులు నిరాశకు గురవుతున్నారు. ఈ యేడాది వర్షాభావం, నీటి సమస్యతో పాటు మిరప పంటకు రేట్లు కూడా తగ్గడంతో రైతుకు కష్టాలే మిగిలాయి. తుంగభద్ర కుడికాలువ (హెచ్చెల్సీ) కింద వేల హెక్టార్లలో మిరప పంట సాగుచేశారు. జలాశయంలో నీటి కొరత వల్ల నీరు సరిగా అందలేదు. దాంతో మిరప పంట దిగుబడులు కూడా అంతంత మాత్రంగానే వచ్చాయి. గతంలో 15 నుంచి 20 క్వింటాళ్ల ఎకరాకు దిగుబడి వస్తుండగా ప్రస్తుతం 8 నుంచి 10 క్వింటాళ్ల మాత్రమే దిగుబడి వచ్చింది. అధికంగా పండించే గుంటూరు, బ్యాడిగ మిరప పంటలకు మార్కెట్లో డిమాండ్ వుంటుంది. ఇప్పటివరకూ సింజెంట 2043 రకానికి రూ. 40వేలు, 5531 రకం మిరపకు రూ. 20 వేలు ధర ఉండేది. ఇప్పుడు 2043 రకం రూ. 17 వేలు నుంచి రూ. 20 వేలు, 5531రకం రూ.14 వేలు నుంచి రూ. 16 వేలు పలుకుతోంది. రైతులకు పెట్టిన పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొంది. దరోజీ, శ్రీరామరంగాపురం, మారుతీ క్యాంపు, సిద్దమ్మనహళ్లి, ఎర్రంగళి, సింధిగేరి, వడ్డట్టి, బాదనట్టి గ్రామ రైతులు ఈ యేడాది పండిన పంటను కల్లంలో వేసుకుని అమ్మకాలకు సిద్ధం చేస్తున్నారు.

మద్దతు ధర కల్పించాలి

ఈ సందర్భంగా రైతు నాయకులు దరూరు పురుషోత్తమ గౌడ మాట్లాడుతూ, హెచ్చెల్సీ కింద రైతులు ఎక్కువగా మిరప పంటను వేసుకున్నారని, నీటి సమస్య వల్ల దిగుబడులు అంతంత మాత్రంగానే వచ్చాయన్నారు. పంటకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే కురుగోడు, బళ్లారి ప్రాంతాల్లో ప్రభుత్వాలు గోడౌన్‌లను ఏర్పాటు చేసి రైతు పంటను స్టాకు వుంచుకునేందుకు ఏర్పాట్లు చేయాలని కోరారు.



మారుతీ క్యాంపు వద్ద మిరపకాయలను ఆరబెడుతున్న కూలీలు

దేశాభివృద్ధిలో యువతదే ముఖ్యపాత్ర: ప్రశాంత్

నేడు కొప్పళలో కేఆర్ఎస్ పార్టీ యువజన సమ్మేళనం

బళ్లారి సిటీ, జనవరి 11: దేశాభివృద్ధిలో ముఖ్యపాత్ర పోషించ డానికి యువత సిద్ధం కావాలని కేఆర్ఎస్ పార్టీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి ప్రశాంత్‌రెడ్డి అన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈవిషయంలో సమగ్ర యువజన విధానం అవసరమని, వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా శుక్రవారం కొప్పళలో కర్ణాటక రాష్ట్ర సమితి రాష్ట్రస్థాయి యువజన సదస్సును నిర్వహిస్తున్నామన్నారు. సున్నితమైన దేశాన్ని నిర్మించేందుకు పాటుపడుతున్న కర్ణాటక రాష్ట్ర సమితితో యువత చేతులు కలపాలని కోరారు. దేశంలో యువకుల జనాభా 50శాతానికి పైగా ఉందని, ఈవర్గాన్ని దేశ అభివృద్ధికి సక్రమంగా వినియోగించుకోవడం లేదన్నారు. యువతకు సరైనవిద్య, ఉపాధి, పొందే నైపుణ్యాలు లేకపోవడంవల్ల వారు అక్రమ మార్గాలవైపు ప్రభావితమవుతున్నారన్నారు. పారిశ్రామికవేత్తలు తమకు సరైన నైపుణ్యం ఉన్నవారు రావడం లేదని చెబుతున్నారని, ప్రభుత్వాలు మాత్రం లక్షల మందికి శిక్షణ ఇచ్చామని చెబుతున్నాయని ఈ వైరుధ్యం ఎలా సంభవమని ప్రశ్నించారు. జీవితానికి భద్రత లేని కాంట్రాక్టు ఉద్యోగాల్లో జీవితాంతం పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. యువకులు డ్రగ్స్, బెట్టింగ్, మద్యపానాలకు బానిసలుగా మారుతున్నారని అన్నారు. విశ్వవిద్యాలయాలు పట్టాలు తప్పుతున్నాయని, యువతను అనవసర సమస్యల కోసం దారి మళ్లిస్తున్నారని ఆరోపించారు. తమ పార్టీ జరుగుతున్న అక్రమాలపై నిరంతరం పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మంజునాథ, ప్రశాంత్‌రెడ్డి, విజయ్‌కుమార్, ప్రకాశ్‌రెడ్డి, ఆసుండి మోహన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేఆర్ఎస్ పార్టీ ప్రముఖులు

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

బళ్లారి సిటీ, జనవరి 11: వాహన యజమానులు , డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని ట్రాఫిక్ పోలీసు అధికారి అయ్యనగౌడ పాటిల్ తెలిపారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా గురువారం నగరంలోని సరళాదేవి కళాశాల ఆవరణలో జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయితీ, నెహ్రూ యువకేంద్రం, ట్రాఫిక్ పోలీస్ శాఖ, జాతీయ సేవా పథకం, శ్రీ మేధా కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలను ప్రభుత్వం ప్రతి సంవత్సరం పాటిస్తున్నదన్నారు. నెలరోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా డ్రైవర్లు, వాహన యజమానులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పిస్తామన్నారు. మానవ తప్పిదాల వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. వారిపై ఆధారపడిన వారు నిరాశ్రయుల వుతున్నారన్నారు. వాహనం ఎక్కగానే డ్రైవర్లు కుటుంబం, వారిపై ఆధారపడిన వారిని గుర్తుపెట్టుకోవాలని, అన్నిటికంటే ప్రాణం ముఖ్యమని అర్థం చేసుకోవాలన్నారు. మొబైల్లో మాట్లాడడం మానుకోవాలని తెలిపారు. ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సరళాదేవి కాలేజ్ ప్రిన్సిపాల్ మంజునాథ్‌రెడ్డి, నెహ్రూ యువకేంద్రం యువజన అధికారి పత్తర్, స్కౌట్స్ అండ్ గైడ్స్ బృందం, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న అయ్యనగౌడ పాటిల్

పిల్లలకు చదువుపై ఆసక్తి కలిగించాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా ఉద్బోధ

బళ్లారి సిటీ, జనవరి 11: పిల్లల్లో చదువు పట్ల మరింత ఆసక్తిని పెంపొందించాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా పేర్కొన్నారు. జిల్లాపరిపాలన, జిల్లాపంచాయితీ, పబ్లిక్ ఎడ్యుకేషన్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పదవతరగతి స్థాయిలో పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ఈశిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. శిక్షణ పొందిన అనంతరం 165మంది అధికారులు జనవరి 17నుంచి 20లోగా కేటాయించిన పాఠశాలలను సందర్శించి పిల్లలకు కూడా శిక్షణ ఇచ్చి నివేదిక సమర్పించాలన్నారు. జిల్లాపంచాయితీ కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని చాలా మంది చిన్నారులకు కొన్ని సబ్జెక్టుల సమాచారం మాత్రమే ఉందన్నారు. పిల్లలు నేర్చుకోవడంలో ఆసక్తిని పెంచాలన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విద్యాశాఖ ఉప సంచాలకులు ఉమాదేవి, జీపీపీ చీఫ్ ప్రాజెక్టు అధికారి వాగీశ్ శివాచారి. జిల్లావిద్యాశాఖాధికారులు, డైట్ సీనియర్,జూనియర్ లెక్చరర్లు, జిల్లా సమన్వయ కర్తలు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఈసీఓ. జిల్లా , తాలూకా వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రశాంత్‌కుమార్

హాస్టల్ విద్యార్థిని ప్రసవం

● మధుగిరిలో 9వ తరగతి చదువుతున్న బాలిక

బెంగళూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం తుమకూరు జిల్లా మధుగిరి పట్టణంలో 9వ తరగతి చదువుతున్న హాస్టల్ విద్యార్థిని ప్రసవించడం కలకలం రేపింది. చిక్కబళ్ళాపుర జిల్లా బాగేపల్లి ప్రాంతంలో నివసించే పేద కుటుంబానికి చెందిన బాలికను మధుగిరి హాస్టల్‌లో చేర్పించారు. తల్లి అంగన్‌వాడీ కార్యకర్తగా పని చేస్తున్నారు. ఇటీవల వారం రోజులుగా బాలికకు తీవ్రమైన కడుపునొప్పి రావడంతో హాస్టల్ నుంచి బాగేపల్లిలోని తల్లి చెంతకు చేర్చారు. అక్కడి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్ళగా సాధారణంగా భావించిన వైద్యులు చికిత్స చేసి పంపారు. ఇంటికెళ్ళిన కాసేపటికే తీవ్రమైన కడుపునొప్పి రావడంతో బాలిక తట్టుకోలేక పోయింది. మరోసారి ఆసుపత్రికి రాగా స్కానింగ్ చేయడంతో గర్భిణిగా నిర్ధారణ అయింది. సోమవారం ఆసుపత్రిలోనే కాన్పు కాగా మగబిడ్డ జన్మించింది. ఆసుపత్రి వర్గాలు వివరాలు నమోదు చేసే వేళ విద్యార్థినిగా తేలింది. వెంటనే వైద్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. తల్లీబిడ్డను చిక్కబళ్ళాపుర జిల్లాసుపత్రికి తరలించారు. బాలిక తెలిపిన మేరకు ఆమెకు మధుగిరి హాస్టల్ సమీపంలో ఓ యువకుడితో శారీరక సంబంధం ఉన్నట్లు తెలిసింది. ఈమేరకు సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు గురువారం మధుగిరి హాస్టల్‌ను సందర్శించి ఆరా తీశారు. హాస్టల్‌వార్డెన్ నివేదితాను సస్పెండ్ చేశారు.

ఘనంగా గాలి జనార్దన్‌రెడ్డి పుట్టినరోజు



జనార్దన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న దృశ్యం

బళ్లారిరూరల్, జనవరి 11: మాజీ మంత్రి, గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్ రెడ్డి జన్మదిన వేడుకలను ఆయన సతీమణి లక్ష్మీ అరుణ, కుమార్తె బ్రాహ్మణిల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 57 కిలోల కేక్‌ను పార్టీ అభిమానుల ఆధ్వర్యంలో కట్‌చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. జిల్లా ఆస్పత్రిలో మంత్రి జన్మదినం సందర్భంగా రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్‌లు పంపిణీ చేశారు. అదేవిధంగా నగరంలో పెద్ద ఎత్తున యువకులు ర్యాలీ నిర్వహించారు. వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు దమ్మూరు శేఖర్, కేఆర్‌పీపీ ప్రముఖులు ఉమారాజ్, శ్రీనివాస రెడ్డి, గుర్రం వెంకటరమణ, అలీఖాన్, మున్నాబాయ్, కేస్ దివాకర్, మల్లికార్జున, మహిళా జిల్లా కేఆర్‌పీపీ అధ్యక్షురాలు హంపి రమణమ్మ, హేమలత పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ



సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బీఎం నాగరాజ

సిరుగుప్ప, జనవరి 11 : రూ.25 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే బీఎం నాగరాజు గురువారం భూమిపూజ చేశారు. సిరుగుప్ప పరిధిలోని కేసూగూరు క్యాంపు వద్ద సీసీ రోడ్డు పనులకు ఆయన శ్రీకారం చుట్టారు. పనులను నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ సభ్యులు, కౌన్సిలర్ గణేష, తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి : ఎస్పీ

హొసపేట, జనవరి 11: వాహన దారులు హెల్మెట్ తప్పరిసరిగా ధరించాలని విజయనగరం జిల్లా ఎస్పీ శ్రీ హరిబాబు తెలిపారు. హొసపేటలో జిల్లాసబ్‌డివిజన్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం జాతీయ రహదారి భద్రతా వారోత్సావాలను ప్రారంభించి ఆయన మాట్లాడారు. బైక్‌లపై కాలేజీకి వెళ్లే మైనర్ విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మద్యంతాగి వాహనాలు నడపరాదని, సిగ్నల్స్‌ని పాటించాలన్నారు.

తాలూకా పరిపాలనాధికారిగా సిద్దరామేశ్వర

కంప్లి, జనవరి 11 : రాష్ట్ర ప్రభుత్వం సిద్దరామేశ్వరను కంప్లి తాలూకా పరిపాలనా అధికారిగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడంతో ఆయన శుక్రవారం తాలూకా కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిశాఖ అధికారి త్వరలోనే జరగవలసిన అభివృద్ధి పనుల గురించి పరిశీలించారన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు తహసీల్దార్‌శివరాజ్, ముఖ్యఅధికారి దుర్గన్న, తాలుకా పంచాయతీ అధికారి శివకుమార్, పోలీసు శాఖ అధికారి వాసుకుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సిద్దరామేశ్వర

ఆలయాల్లో ఘనంగా అమావాస్య పూజలు

కంప్లి, జనవరి 11: నూలు అమావాస్య సందర్భంగా కంప్లి పరిధిలోని వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు. సంక్రాంతి ముందు వచ్చే ఈ అమావాస్య సందర్భంగా పలు గ్రామాల్లో ప్రజలు తమ ఆరాధ్య దైవానికి పూజలు చేపట్టి మొక్కులు సమర్పించుకున్నారు. అలాగే రైతన్నలు పొలాల్లోకి వెళ్లి పంటలు కోసిన అనంతరం ప్రత్యేక పూజలు చేపట్టారు. ప్రతి యేటా ఈ నూలు అమావాస్యను రైతులతోపాటు ప్రజలు కూడా ప్రత్యేకంగా జరుపుకుంటారు. జోగి కాలువ వద్ద వున్న వరసిద్ధి వినాయకుని ఆలయంలోను, కంప్లి కాళికాదేవి ఆలయంలోను, బుక్కసాగర ఏళుపడ గల నాగప్ప, కొట్టూరు బసవేశ్వర స్వామి, సన్నాపురం వీరభద్రేశ్వర స్వామి, కురుగోడు దొడ్డ బసవేశ్వర స్వామి తదితర ఆలయాలలో ప్రత్యేక పూజలు చేపట్టారు. పూలు, పండ్లతో మొక్కులు సమర్పించుకున్నారు. అలాగే కంప్లి షుగర్ ఫ్యాక్టరీలో కాళికాదేవికి ప్రత్యేక పూజలు చేపట్టి అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.



ప్రత్యేకాలంకరణలో ఏళుపడగల నాగప్ప

హోసూరు జోన్

వేడుకగా హనుమజ్జయంతి

హోసూరు జనవరి 11 : కృష్ణగిరి జిల్లా శూలగిరి , ఉద్దనపల్లి, పంచాయతీ పాత కొత్తూరు రోడ్డుల్లోని అంజనేయ స్వామి ఆలయాల్లో శ్రీ హనుమజయంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. హను మజ్జయంతి సందర్భంగా హనుమాన్ , వెంకటాచలపతి, తో పాటు అన్ని దేవతలకు పూజలు నిర్వహించారు, నిమ్మకాయ హారాలు, వడమాలలు వేశారు, నెయి, పాలు, పెరుగు, చందనపు అభిషేకం నిర్వహించారు, హనుమంతుని దర్శించుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



సర్వాలంకారయుక్తుడైన ఆంజనేయస్వామి

పెరిగిన పూల ధరలు

హోసూరు జనవరి 11 : పొంగల్ పండుగ సమీపిస్తున్న తరుణంలో హోసూరు పూల మార్కెట్‌లో ధరలు పెరిగాయి, ముఖ్యంగా ఈ పూల మార్కెట్‌కు హోసూరు ప్రాంతంలోని , అంచెట్టి , డెంకణీకోట, తళి, శూలగిరి, బాగలూరు, బేరికై, రాయకోటతోపాటు పలు ప్రాంతాల నుంచి పూలు వస్తుంటాయి. ఈ పరిస్థితిల్లో పొంగల్ పండుగ సమీపిస్తుండటంతో పూల ధర పెరగడం మొదలైంది, గురువారం మార్కెట్‌ల్లో కనకాంబరు కేజీ రూ.800, చామంతి కేజీ రూ.120, పన్నీర్ ఆకులు కిలో రూ.70, సంపంగి కేజీ రూ.80, రోజా పూలు కేజీ రూ.140, అరళి పూలు కేజీ రూ.300, కోడీ జుట్టు పూలు కేజీ రూ.80 వంతున విక్రయిస్తున్నారు, ఇదిలా ఉండగా పొంగల్ పండుగ సమీపస్తుండటంతో పూల ధరలు పెరుగుతాయని వ్యాపారులు తెలిపారు.



పోలింగ్ ఏజెంట్ల చిరునామాలు సేకరించాలి

హోసూరు(మత్తిగిరి) జనవరి 11 :పోలింగ్ కేంద్రాల ఏజెంట్ల చిరునామాలు, సెల్‌ఫోన్ నంబర్‌లను పోలింగ్ స్టేషన్ వారీగా గుర్తించాలని జిల్లా ఇన్‌చార్జి ఆహార సరఫరా మంత్రి చక్రపాణి కోరారు. తళి రోడ్డులోని పశ్చిమ జిల్లా డీఎంకే కార్యాలయం సమీపంలో గురువారం సభ్యుల సమావేశం జరిగింది. రానున్న పార్లమెంట్ ఎన్నికలకు ముందు జిల్లాలు, మండలాల, వారీగా పోలింగ్ ఏజెంట్ల సమావేశం నిర్వహిస్తున్నామని, ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ ఈ కార్యక్రమంల్లో పాల్గొని ప్రత్యేక ఉపన్యాసం చేస్తూ పాల్గొనేవారిని ప్రోత్సాహించబోతున్నారన్నారు. ఇందులో భాగంగా హోసూరులో సభకు జిల్లా కార్యదర్శి ఎమ్మెల్యే వై.ప్రకాశ్ అధ్యక్షత వహించారు. మేయర్ సత్య అందరికీ స్వాగతం పలికారు, ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి ఆహార సరఫరా మంత్రి చక్రపాణి ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొని మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికలకు వంద రోజులు మాత్రమే మిగిలిందని, ఈ సమయంలో వివరాలన్నీ తెలుసుకుని,, ప్రభుత్వ పథకాలు తెలియజేయాలన్నారు. అలాగే నాలుగు వేల ఉచిత బస్సులు, రూ.32 కోట్లతో హోసూరు కు కొత్త బస్టాండు నిర్మాణం, ఇలా పథకాల గురించి తెలియజేయాలని తెలిపారు. సమావేశం ముగింపు సందర్భంగా దక్షిణ మండల కార్యదర్శి తిమ్మరాజు కృతజ్ఞతలు తెలిపారు, సమావేశంల్లో రాష్ట్ర యువజన ఉపకార్యదర్శి శ్రీనివాస్, మాజీ ఎమ్మేల్యే మురుగన్, జిల్లా ఉప కార్యదర్శి పుష్పా సర్వేశ్, , ముఖ్య కార్యవర్గ సభ్యుడు ఎల్లోరమణి , డిప్యూటీ మేయర్ ఆనందయ్య, స్థాయి కమిటీ నాయకులు మాదేశ్వరన్, జిల్లా యూత్ కమిటీ సుమన్, సిటీ యూత్ కలైసెళియన్, చెన్నీరప్ప, నిర్వాహకులు పాల్గొన్నారు, గజేంద్రమూర్తి, నాగేశ్ రవి తదితరులు పాల్గొన్నారు.



డీఎంకే సభ్యుల సమావేశంలో పాల్గొన్న నేతలు

కృష్ణా నది వంతెన మూసివేత వాయిదా..!



కర్ణాటక-తెలంగాణ రాష్ట్రాల సరిహద్దులోని కృష్ణానది వంతెన

రాయచూరు, జనవరి 11: కర్ణాటక-తెలంగాణ రాష్ట్రాల సరిహద్దులో కృష్ణానదిపై ఉన్న రోడ్డు వంతెనపై రాకపోకల నిలిపివేత ఈ నెల 17వ తేదీకి వాయిదా పడిందని రాయచూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ శివరాజ్ పాటీల్ తెలిపారు. గురువారం నగరంలోని విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడిన ఎమ్మెల్యే, సంక్రాంతి పండుగతో పాటు ఈ సందర్భంగా యాదగిరి జిల్లాలో జరిగే మైలారలింగ జాతరను పురస్కరించుకుని వంతెన మూసివేతను వాయిదా వేయాల్సిందిగా జిల్లాధికారిని కోరామన్నారు. ఈ క్రమంలో జిల్లాధికారి కృష్ణానదిపై ఉన్న వంతెన మీద నుంచి రాకపోకలను ఈ నెల 17వ తేదీ నుంచి నిలిపివేస్తున్నట్లు తెలిపారన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా పుణ్యనది స్నానాలు ఆచరించేవారు కృష్ణనదికి పెద్దసంఖ్యలో వెళతారని యాదగిరి జిల్లా గురుమిఠకల్ సమీపంలో ఉండే మైలార్‌లింగ జాతరకు సహితం స్థానికంగానే కాకుండా తెలంగాణ, ఏపీ రాష్ట్రాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చే అవకాశం ఉన్నందున వంతెన పై రాకపోకలు సంక్రాంతి ముగిసే వరకు కొనసాగించాలని తాము కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

బాలల్లో పౌష్టికత పెంపునకు కృషి

రాయచూరు, జనవరి 11: జిల్లాలోని బాలల్లో పౌష్టికాహారలోపాన్ని నివారించి వారిలో పౌష్టికత్వం పెంపు కోసం సంబంధితశాఖల అధికారులు సమన్వయంతో నిబద్ధతతో పనిచేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సమితి సభ్యుడు వెంకటేశ్ సూచించారు. బాలల హక్కుల పరిరక్షణ పౌష్టికత పెంపు తదితర అంశాలపై గురువారం నగరంలోని డీహెచ్ఓ కార్యాలయంలో ప్రగతి పరిశీలన సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పరిరక్షణ సమితి సభ్యుడు వెంకటేశ్, ప్రత్యేక అవసరాలు ఉన్న జిల్లాగా రాయచూరును గుర్తించిన నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే నిధుల ఆధారంగా తగిన కార్యాచరణను సిద్ధం చేసుకోవాలన్నారు. బాల్య వివాహాలు జరగకుండా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని అదే సమయంలో పాఠశాలల్లోని బాలలకు ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి వారికి పౌష్టిక ఆహార లోప నివారణలో తీసుకోవల్సిన జాగ్రతల గురించి అవగాహన కల్పించాలన్నారు. కాగా జిల్లాలో మాత,శిశు మరణాల తగ్గింపు కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని వివిధ శాఖల అధికారులకు ఆయన సూచించారు.

హరివిల్లు.. విరిజల్లు..

వైభవంగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్

కలర్‌ఫుల్ : రంగులమయమైన నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని టెన్నిస్ కోర్టు





ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

"ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్‌బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు, రియల్ పార్టనర్స్ స్వర్గసీమ సుకేతన" ఫైనల్స్ గురువారం విజయవాడలో అంగ'రంగుల' వైభవంగా జరిగాయి. బెంజిసర్కిల్ సమీపంలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీ టెన్నిస్ కోర్టులో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 జిల్లాల స్థాయిలో విజేతలుగా నిలిచిన మహిళలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కూడా పాల్గొన్నారు. తమ సృజనతో ముత్యాల ముగ్గుల్లో రంగుల దృశ్యాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన బహుమతుల ప్రదానోత్సవానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కెనరా బ్యాంక్ విజయవాడ సర్కిల్ ఏజీఎం జీపీ నరసింహారావు, కెనరా బ్యాంక్ మార్కెటింగ్ సర్కిల్ సీనియర్ మేనేజర్ శిరీష, 'ఆంధ్రజ్యోతి' న్యూస్ ఎడిటర్ నాగసుధాకర్, 'ఆంధ్రజ్యోతి' విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ, ఏబీఎన్ ఏపీ బ్యూరో బి.రామారావు, యాడ్స్ ఏజీఎం టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, మల్లెల శుభప్రద వ్యవహరించారు. - ఆంధ్రజ్యోతి, విజయవాడ

ప్రథమ బహుమతి గెలుచుకున్న విజయనగరం జిల్లా మహిళ

గుంటూరు, అనంతపురం, తమిళనాడు మహిళలకు ద్వితీయ బహుమతులు

11 మందికి కన్సొలేషన్ బహుమతులు

బహుమతులు ప్రదానం చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



పరిశీలన : ముగ్గులను పరిశీలిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

రెండుసార్లు రాష్ట్రస్థాయి బహుమతి పొందా..



నేను టైలరింగ్ చేస్తాను. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నప్పటి నుంచీ పాల్గొంటున్నా. హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి సాధించాను. తర్వాత 2023లో నిర్వహించిన పోటీల్లో రెండోసారి ప్రథమ బహుమతిని పొందాను. మళ్లీ ఇప్పుడు ద్వితీయ బహుమతి పొందా.

- కె.ఉమాదేవి, అనంతపురం జిల్లా

ద్వితీయ బహుమతి విజేతలు

ఐదేళ్లుగా ముగ్గులు వేస్తున్నా



మాది సత్తెనపల్లి వద్ద ఉన్న ధూళిపాళ్ల గ్రామం. ఐదేళ్లుగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్నాను. జిల్లాస్థాయి పోటీల్లో రెండుసార్లు ప్రథమ బహుమతి సాధించాను. 2020లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లోనూ మొదటి స్థానం నాదే. - ఏ.సునీత, గుంటూరు జిల్లా

పదేళ్లుగా పోటీల్లో ఉంటున్నా..



కర్ణాటక, తమిళనాడు సరిహద్దుల్లో నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో ఏటా నేను పాల్గొంటా. పదేళ్లుగా నేను ముగ్గులు వేస్తున్నా. తొలిసారిగా రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నా. ఈ పోటీల్లో ద్వితీయ బహుమతి రావడం చాలా ఆనందంగా ఉంది.

- రాధ, తమిళనాడు



విజేతలు వీరే.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి నుంచి ద్వితీయ బహుమతులు అందుకుంటున్న ఏ.సునీత (గుంటూరు), కె.ఉమాదేవి (అనంతపురం), కె.రాధ (తమిళనాడు), కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న ఆర్.ఆశాజ్యోతి (శ్రీకాకుళం), బి.లక్ష్మి (విశాఖపట్నం), టి.ఆదిశ్రీ (పశ్చిమగోదావరి), మల్లీశ్వరి (తూర్పుగోదావరి), పి.పూజిత (కృష్ణా), ఎం.సునీత (నెల్లూరు), సీహెచ్ మణిమంజరి (ప్రకాశం), విద్య (చిత్తూరు), ఎస్.శ్వేత (కడప), ఎస్.రాజేశ్వరి (కర్నూలు), లిఖిత (కర్ణాటక)

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

స్వామి వివేకానంద (జయంతి)




స్వామి వివేకానంద 1863 జనవరి 12న కోల్కత్తాలో జన్మించారు. అసలు పేరు నరేంద్రనాథ దత్త. హిందూ సాధువు. రామకృష్ణ పరమహంస ప్రధాన శిష్యుడు. మన వేదాలలోని తత్వాలు, యోగాను పాశ్చాత్యదేశాలకు పరిచయం చేసిన ఘనత ఆయనదే. రామకృష్ణ మఠం స్థాపించి ప్రపంచవ్యాప్తి చేశారు. చికాగోలో సర్వమత సమ్మేళనంలో ఆయన చేసిన ప్రసంగం దేశానికి వన్నె తెచ్చింది. ఆయన జ యంతిని 'జాతీయ యువదినోత్సవం'గా ఆచరిస్తున్నాం. 1902 జూలై 4న పరమపదించారు.

జాక్ లండన్ (జయంతి)



జాక్ గ్రిఫిట్ లండన్ 1876 జనవరి 12న జన్మించారు. అమెరికాకు చెందిన నవ లా రచయిత, పాత్రికేయుడు, సమాజసేవకుడు. అమెరికా రచయితలలో తొలిసారి అంతర్జాతీయ గుర్తింపు పొందిన వ్యక్తి ఆయనే. సైన్స్ ఫిక్షన్ కథనాలలో పేరొందారు. ది కాల్ ఆఫ్ ది వైల్డ్, వైట్ ఫ్యాంగ్ వంటి రచనలు పేరొందాయి. ఆయన గౌరవార్థం యునైటెడ్ స్టేట్స్ పోస్టల్ సర్వీస్‌చే ప్రత్యేక పోస్టల్ స్టాంప్ విడుదలైంది. 1916 నవంబరు 22న కన్నుమూశారు.

యల్లాప్రగడ సుబ్బారావు (జయంతి)



దేశ వైద్య శాస్త్రజ్ఞులలో ఒకరైన యల్లాప్రగడ సుబ్బారావు 1895 జనవరి 12న పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జన్మించారు. లెడర్లీ ప్రయోగశాలలో వైద్య బృందం నాయకుడిగా ఫోలిక్ ఆమ్లం యొక్క ప్రత్యేకతను గుర్తించి స్ప్రూ వ్యాధి, మక్రోసైకిట్ అనీమియా అనే రక్తహీనత నిర్మూలనకు మందుగా నిర్ధయించారు. క్షయ రోగాన్ని నివారించే ఐసోనికోటి నికాసిడ్, హైడ్రాక్సైడ్ మందులను కనుగొన్నారు. బోదకాలు, టైఫాయిడ్, పాండురోగం వ్యాధులను నిర్మూలించే మందులను కనుగొన్నారు. 1948 ఆగస్టు 9న అమెరికాలో కన్నుమూశారు.

మహర్షి మహేశ్‌యోగి (జయంతి)



మహర్షి మహేశ్‌యోగి 1918 జనవరి 12న మధ్యప్రదేశ్ రాష్ట్రం జబల్‌పూర్‌లో జన్మించారు. అసలు పేరు మహేశ్ ప్రసాద్ వర్మ. ఆధ్యాత్మిక గురువు స్వామి బ్రహ్మానంద సరస్వతికి శిష్యుడు. భావనాత్మక ధ్యానం చేయడాన్ని చాటారు. 40వేల మందికిపైగా బోధించారు. 2000లో 'గ్లోబల్ కంట్రీ ఆఫ్ వరల్డ్ పీస్' స్వచ్ఛంద సంస్థను స్థాపించారు. వేదిక్ సైన్స్, ధ్యానంపై పలు పుస్తకాలు రచించారు. 2008 ఫిబ్రవరి 5న కన్నుమూశారు.

రామకృష్ణ హెగ్డే (వర్ధంతి)



రామకృష్ణ హెగ్డే 1926 ఆగస్టు 29న ఉత్తరకన్నడ జిల్లా సిద్దాపుర తాలూకాలో జన్మించారు. జనతా పార్టీ నేత. కర్ణాటక రాష్ట్ర పదవ ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. చక్కటి పాలనాదక్షుడిగా పేరొందారు. రాష్ట్రంలో కాంగ్రెసేతర తొలి సీఎం ఆయనే కావడం విశేషం. 'రాష్ట్రీయ నవనిర్మాణ వేదికె' సంఘాన్ని, 'లోక్‌శక్తి' పేరిట సొంత రాజకీయ పార్టీని స్థాపించారు. పలు మార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు రా జ్యసభ సభ్యుడిగా వ్యవహరించారు. కాగా నాటకాలు, సినిమాలలోనూ నటించారు. పలువురు రాజకీయ నాయకులకు ఆయనే గురువు. 2004 జనవరి 12న కన్నుమూశారు.

స్టార్టప్‌ల ప్రగతిలో బ్యాంకుల పాత్ర కీలకం

బెంగళూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను వినూత్నంగా పరిష్కరించే పలు ఆవిష్కరణలను అందిస్తున్న స్టార్టప్‌ల ప్రగతిలో బ్యాంకులు కీలక పాత్రను పోషిస్తున్నాయని ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ పన్నరాజ్ పేర్కొన్నారు. కర్ణాటక పరిశ్రమల సమాఖ్య ఆధ్వర్యంలో నగరంలో చిన్న తరహా పరిశ్రమలు, స్టార్టప్‌ల ప్రగతి అనే అంశంపై ఏర్పాటైన సదస్సులో సౌత్ ఇండియా రీజనల్ కౌన్సిల్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా చైర్మన్‌గా ఉన్న పన్నరాజ్ ప్రధాన ప్రసంగం చేశారు. దేశ స్టార్టప్ రాజధానిగా బెంగళూరు నగరానికి అరుదైన ఖ్యాతి దక్కడం వెనుక చిన్నతరహా పరిశ్రమల కృషి అపారమన్నారు. సమావేశంలో పారిశ్రామికవేత్తలు రవీంద్ర ఎస్.కోరె, ఉమారెడ్డి, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.



వేదికపై సన్మాన గ్రహీతలు



ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను సన్మానిస్తున్న పదాధికారులు

డీసీఎంతో ఒక్కలిగ సంఘం పదాధికారుల భేటీ

బెంగళూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఒక్కలిగ సంఘం పదాధికారులు, కార్యవర్గ సభ్యులు నగరంలో గురువారం ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కలిశారు. ఆయనతో పలు అంశాలపై చర్చలు జరిపారు. లోక్‌సభ ఎన్నికల్లో ఒక్కలిగ కులస్థులకు సాధ్యమైన మేరకు అధిక టికెట్లు ఇవ్వాలని సంఘం పదాధికారులు డీసీఎంను కోరినట్లు తెలుస్తోంది. సంఘం కార్యకలాపాలు చర్చించినట్లు తెలుస్తోంది.

పాత్రికేయుల సమస్యలన్నీ పరిష్కరిస్తా : సీఎం

బెంగళూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో క్రియాశీలకంగా ఉన్న పాత్రికేయ సంఘాల నుంచి తనకు పలు విజ్ఞప్తులు, సూచనలు అందాయని వీటిని పరిశీలించి ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తానని సీఎం సిద్ధరామయ్య భరోసా ఇచ్చారు. బెంగళూరులోని తన అధికార నివాసం కృష్ణలో గురువారం కర్ణాటక పాత్రికేయుల సహకార సంఘం రూపొందించిన 2024 వార్షిక కేలండర్‌ను ఆయన విడుదల చేశారు. సీఎం మీడియా కార్యదర్శి ప్రభాకర్‌తో పాటు పాత్రికేయు ల సహకార సంఘం అధ్యక్షుడు రమేష్ ఎం.పాళ్య, ఉపాధ్యక్షులు దొడ్డబొమ్మె, కోశాధికారి మోహన్‌కుమార్ పాల్గొన్నారు.



క్యాలండర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం సిద్ధరామయ్య

14 నుంచి సంక్రాంతి సంబరాలు

బెంగళూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రాజధాని బెంగళూరులో ఎలక్ట్రానిక్ సిటీ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఈ నెల 14, 15 తేదీల్లో జరగనున్నాయి. ఈ మేరకు అసోసియేషన్ నగరంలో గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఎలక్ట్రానిక్‌సిటీ రెండో ఫేజ్‌లోని అష్టలక్ష్మి దేవస్థానం ఆడిటోరియంలో 14న ఉదయం 5-30 గంటలకు భోగిమంటలతో కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. 8 గంటలకు ముగ్గుల పోటీలు, 9-30 గంటలకు గోదాదేవి కల్యాణం, మ. ధ్యాహ్నం 2 గంటల నుంచి పిల్లలు, పెద్దల సాంస్కృతిక కార్యక్రమాలు, సాయంత్రం 4-30 గంటలకు చిన్నపిల్లలకు భోగి పళ్ళు వేసే కార్యక్రమాలు ఉంటాయి. సాయంత్రం 5-30 నుంచి సంగీత కార్యక్రమాలు ఉంటాయి. ఇక 15న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు హరిదాసు వేషధారణ, ఎద్దుల బండి విహారం, గంగిరెద్దు మేళం కార్యక్రమాలను నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు కోలాట నృత్యం, అనంతరం ఉట్టికొట్టు కార్యక్రమం జరుగుతాయి. సాయంత్రం 4 గంటల నుంచి పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తారు. కాగా బెంగళూరు ఇస్రోలోని చంద్రయాన్, గగనయాన్ తదితర ప్రాజెక్టులలో పనిచేస్తున్న శాస్త్రవేత్తలు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరై ప్రవాసాంధ్రుల్లో స్ఫూర్తి నింపనున్నారని ప్రకటనలో పేర్కొన్నారు.

పాత టైటిల్‌తో కొత్త కథ గంగె గౌరి




సినిమాలో ప్రముఖ నటులు

బెంగళూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): చందనసీమలో గతంలో డా.రాజ్‌కుమార్, లీలావతి, భారతి నటించిన గంగె గౌరి భారీ హిట్ సాధించిన సంగతి విదితమే. తాజాగా ఇదే టైటిల్‌తో ఆసక్తి రేకెత్తించే కొత్త కథతో మళ్ళీ మరో సినిమా తెరకెక్కబోతున్నది. ఈ సినిమాకు బెంగళూరు తిండ్లు సమీపంలోని వీరభద్రస్వామి ఆలయంలో ము హూర్త సన్నివేశాల చిత్రీకరణ వైభవోపేతంగా జరిగింది. ప్రముఖ దర్శకుడు సాయిప్రకాష్, కెటివిఎ అధ్యక్షుడు రవి ఆర్. గరణి ముఖ్యఅతిథులుగా హాజరై చిత్రం యూనిట్‌ను అభినందించారు. ఈ సందర్భంగా సమాజ సేవకుడు శివానంద దొడ్మని, లయన్ మనోజ్‌కుమార్, డైరెక్టర్ల సంఘం అధ్యక్షుడు ఎన్ఆర్‌కె.విశ్వనాథ్ తదిరులు హాజరయ్యారు. మధు కార్తీక్, ప్రజ్వల్ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. తుళజా బాయి, రూప ఎస్.దొడ్మని, సుమిత ప్రవీణ్, బసవరాజ్ దేశాయి సహనిర్మాతలుగా ఉన్నారు. సినిమాకు కథను సమర్పించి బిఎ.పురుషోత్తమ్ ఓంకార్ దర్శకత్వం వహిస్తున్నారు. తాను ఇంతవరకు మొత్తం 27 సినిమాలకు దర్శకత్వం వహించానని ఇందులో 23 పౌరాణిక సినిమాలు కాగా 4 కమర్షియల్ సినిమాలు ఉన్నాయన్నారు. గంగెగౌరి టైటిల్ పాతదే అయినా కథమాత్రం చాలా కొత్తగా ఉంటుందని ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుందని ఆయన మీడియాకు చెప్పా రు. ఈ సినిమా కోసం గ్రాఫిక్స్‌ను కూడా వినియోగించబోతున్నట్లు చెప్పారు. మైసూరు, శ్రీరంగపట్టణ, ఊటి తదితర అందమైన లోకేషన్లలో 30 రోజుల పాటు చిత్రీకరణ జరిపేందుకు స న్నాహాలు చేస్తున్నామన్నారు. ఈ చిత్రంలో గణేశ్‌రావ్ కేసర్కర్ ప్రధాన పాత్రను పోషిస్తున్నారు. ప్రముఖ నాటక రంగ కళాకారిణి రూపాలి మూడు షేడ్‌లలో అంటే గౌరి, పార్వతి, దాక్షాయణి పాత్రల్లో కనిపించనున్నారు. నిఖితాస్వామి గంగెగానూ, నారదుడిగా జయసింహ ముసూరి, దక్షబ్రహ్మగా శోభరాజ్, శనిదేవుడిగా ఎస్కార్ట్ శ్రీనివాస్, బ్రహ్మగా శ్రీనివాసగౌడ నటిస్తున్నారని దర్శకుడు తెలిపారు. నాలుగు పాటలకు రాజ్‌భాస్కర్ సంగీతాన్ని అందిస్తున్నారు.

చిత్రజ్యోతి

సిక్స్‌ప్యాక్‌లో ప్రత్యక్షమైన రగడ్ రాజవర్ధన్



చందనసీమలో నటీనటులు సరికొత్త లుక్‌లో కనిపించేందుకు ఆరాటపడుతున్నారు. హీరోలైతే పోటాపోటీగా సిక్స్‌ప్యాక్ వైపు ఆకర్షితులవుతున్నారు. ప్రస్తుతమైతే ఇదే ట్రెండ్ సాగుతోంది. విభిన్న పాత్రలతో సినీ పరిశ్రమలో ఖ్యాతి పొందిన నటుడు డింగ్రీ నాగరాజ్ కుమారుడు మ్యాసివ్ స్టార్ రాజవర్ధన్ బిచ్చుగత్తి అనే సినిమా ద్వారా హీరోగా చందనసీమకు పరిచయమయ్యారు. చరిత్ర నేపథ్యం కలిగిన ఒక సినిమా కోసం ఆయన దేహదారుఢ్యాన్ని పెంచుకున్నారు. అనంతరం ప్రణయం, హిరణ్య, గజరా మ సినిమాల్లో నటించారు. ఇప్పుడు మరో యాక్షన్ చిత్రంకోసం రాజవర్ధన్ సిక్స్‌పాక్‌ను పెంచుకుని హీరోలు రక్షిత్ శెట్టి, రుచితా రామ్, డాలి ధనంజయ్, దు నియా విజయ్, దర్శన్, సుదీప్‌ల సరసన నిలిచారు. మాస్టర్ శ్రీనివాసగౌడ మార్గదర్శకత్వంలో రాజవర్ధన్ తదుపరి సినిమా కోసం సిద్ధమవుతున్నాడని కేవలం 8 నెలల్లోనే తన దేహాన్ని సిక్స్‌ప్యాక్‌గా మార్చుకున్నాడని చందనసీమ వర్గాలు అంటున్నాయి. ఇప్పుడు తాజాగా రాజవ ర్ధన్ నటించబోయే చిత్రం గురించే చందనసీమలో ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది.

ఎద్దుల బండిని ఢీకొన్న బొలెరో వాహనం

విడపనకల్లు, జనవరి 11: అనంతపురం జిల్లా విడపనకల్లు మండల కేంద్రంలోని అనంతపురం-బళ్లారికి వెళ్లే 47వ జాతీయ రహదారిపై ఎద్దులబండిని బొలరో వా హనం ఢీకొన్న ఘటనలో రెండు ఎద్దులు మృతి చెందగా, ఇద్దరికి గాయాలైన సంఘటన గురువారం ఉదయం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే.. విడపనకల్లు గ్రామానికి చెందిన ఈశ్వర్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఎద్దుల బండిపై పొలానికి బయలు దేరారు. గ్రామ చివరున పెట్రోల్ బంక్ దాటిన తరువాత అనంతపురం నుంచి బళ్లారికి వెళ్లే బొలేరో వాహనం వెనుక నుంచి ఢీ కొట్టడంతో రోడ్డు పక్కన వెళ్తున్న ఎద్దుల బండి ఎగిరిపడి నుజ్జు నుజ్జు అయ్యింది. ఎద్దులు పక్కనే ఉన్న పొలంలోకి పడి అక్కడి కక్కడే మృతి చెందాయి. బండిలో ఉన్న మహేంద్ర, రాజమ్మలకు తీవ్ర గాయాలు అయ్యాయి. వీరిద్దరిని అనంతపురం ఆసుపత్రికి తరలించారు. ఎద్దులు మృతి చెందటంతో పాటు, బండి దెబ్బతినడంతో రూ.2.50లక్షలు నష్ట పోయాడు.

నేడు వివేకానంద జయంతి

బెంగళూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సమర్థ భారత ట్రస్టు, బెంగళూరు సిటీ యూనివర్సిటీల సంయుక్త ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జ యంతి, జాతీయ యువజనోత్సవాన్ని శుక్రవారం నగరంలో నిర్వహించనున్నారు. జ్ఞానజ్యోతి ఆడిటోరియంలో ఉదయం 11 గంటలకు జరిగే కార్యక్రమంలో బెంగళూరు నృపతుంగ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డా.శ్రీనివాస్ బళ్లి, మహారాణి క్లస్టర్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ డా.ఎల్.గోమతి దేవి, బెంగళూరు సిటీ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొ.నరసింహమూర్తి, సమర్థ భారత తరుపున మెంటర్ ఎన్.తిప్పేస్వామి ముఖ్యఅతిథులుగా పాల్గొనునున్నారు.

బీఎంఆర్‌సీఎల్ ఎండీగా మహేశ్వర్ రావు

బెంగళూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు మెట్రో రైల్ కార్పొరేషన్ (బీఎంఆర్‌సీఎల్) నూతన మేనేజింగ్ డైరెక్టర్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారి ఎం. మహేశ్వర్‌రావ్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

13న 'రామరసం' సంగీత కార్యక్రమం

బెంగళూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రుతి లయ సంగీత కల్చరల్ అకాడమీ అయోధ్యలో రామమందిర ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ నెల 13న పిబరే రామరసం పేరిట ప్రత్యేక భక్తి సంగీత కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తోంది. ఈ మేరకు సంస్థ నగరంలో గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. మల్లేశ్వరంలోని గాంధీ సాహిత్య సంఘం ప్రాంగణంలో సాయంత్రం 5-30 గంటలకు కార్యక్రమం ప్రారంభం కానుంది. ముఖ్యఅతిథులుగా ప్రముఖ పాత్రికేయుడు దు.గు.లక్ష్మణ, రాజీవ్‌గాంధి లా కాలేజీ ప్రిన్సిపాల్ డా.బి.ఆర్.మంజుళ ప్రత్యేక అతిథిగా ఆర్ఎస్ఎస్ దక్షిణ ప్రాంత ప్రముఖ్ రాజేష్ పద్మార్ ప్రత్యేక అతిథిగా పాల్గొంటారని ప్రకటనలో తెలిపారు. శ్రుతిలయ సంగీత కల్చరల్ అకాడమీ గాయకుల బృందం శ్రీనాథ్ భరద్వాజ్, జ్యోతి రవి ప్రకాష్, హెచ్ఎస్ శ్రీనివాసమూర్తి, సుధా మంజునాథ్, డా.శ్రేయే శ్రీహరి, అనన్య కృష్ణమూర్తి పిబరే రామరసం పాటలను పాడనున్నారు.

విద్యార్థిని చెంప చెళ్లుమనిపించిన కండక్టర్

బెంగళూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): అవ్వా టికెట్ ఇవ్వు ..అంటూ ఓ విద్యార్థిని కండక్టర్‌ను కోరింది. అంతే ఎక్కడా లేని కోపంతో కండక్టర్ చెంప చెళ్లుమనిపించారు. చెంపతో పాటు చెవి భాగానికి బలమైన దెబ్బ తగలడంతో ఏకంగా వినికిడి లోపం ఏర్పడిన సంఘటన మండ్య జిల్లాలో చోటు చేసుకుంది. కేఎం దొడ్డి గ్రామం నుంచి జిల్లా కేంద్రమైన మండ్యకు విద్యార్థిని కావ్యశ్రీ పాఠశాలకు వెళతారు. బుధవారం యథావిధిగా ఆర్‌టీసీ బస్సు ఎక్కారు. శక్తి గ్యారెంటీలో భాగంగా డబ్బులు చెల్లించకపోయినా మహిళలు ఆధార్‌కార్డు చూపి టికెట్ కొనుగోలు చేయాల్సి ఉంటుంది. విద్యార్థిని మహిళా కండక్టర్ సౌభాగ్యమ్మను చూసి అవ్వా మండ్యకు ఒక టికెట్ ఇవ్వు అంటూ కోరింది. అంతలోనే ఆవేశానికి లోనైన కండక్టర్ బలంగా విద్యార్థిని చెంపపై కొట్టారు. అదే ఆగ్రహంతో మరో దెబ్బ వేశారు. ఒక్కసారిగా కండెక్టర్ ఎందుకు విద్యార్థినిపై చేయిచేసుకునారనేది తోటి ప్రయాణికులు తెలుసుకోలేక పోయారు. కానీ విద్యార్థిని చెవినొప్పి భరించలేక కూర్చోడవంతో విషయం కాస్త వెలుగులోకి వచ్చింది. వెంటనే విద్యార్థినిని బంధువులు ఆసుపత్రికి తీసుకెళ్ళారు. చెవికి బలమైన దెబ్బ తగిలిందని అదే కారణంతో కాస్త వినికిడి సమస్య ఏర్పడిందని వైద్యులు నిర్ధారించారు. కండక్టర్ తీరుపై ప్రజలు, విద్యార్థులు గురువారం కేఎం దొడ్డిలో నిరసన తెలిపారు.